# కుచేలుడు

*(కుచేలుడొక బ్రాహ్మణ బాలుడు. సమదృష్టికి ఆదర్శమైన విద్యామందిరము సాందీపని ఆశ్రమము. రాజ కుమారులగు బలరామకృష్ణులతోకూడి ఆడి విద్యనభ్యసించిన పరమ పుణ్యుడు ఈ కుచేలుడు. విద్య పూర్తికాగానే గృహస్థుడై అనేకమంది బిడ్డలతో దారిద్ర్యమును అనుభవించుచుండ, దారిద్ర్య నివారణకై బాల్యస్నేహితుడైన కృష్ణుని దర్శించెను. అతనిచే బహుళ భాగ్యమునందుకొని భగవంతుడైన కృష్ణుని దయానుగ్రహములను కొనియాడెను. పాత బట్టలో ముడివేసుకొని పోయిన పిడికెడు అటుకులు పరమాత్మ ప్రీత్యర్థముగా అర్పితము చేయుటచే భగవదనుగ్రహమును, అంతకు వేయి రెట్లు భాగ్యమును అందుకోగలిగితినను నీతిని లోకానికి చాటెను. పరమాత్ముని ప్రసన్నతయే లోకసౌభాగ్యము నందించునని కూడను నుడివెను. బంధుమిత్రులకంటె బాధలలో భగవంతుడే నిజబంధువు, అతడే ఆపద్బాంధవుడని స్వానుభవ రూపమైన ఆదర్శములతో లోకానికి చాటిన పరమభక్తుడు కుచేలుడు.)*

**మిత్రులెవరు?**

లోకమున ఒకరికొకరు తామనుభవించి ఆనందించిన తత్త్వమును, సత్యమును, పంచుకొనుటకు అనుసరించుటకు మిత్రులత్యవసరము. కానీ, మిత్రులంటే యెవరు? మైత్రి వలన జీవితమునే సార్థకము గావించవచ్చు, లోకమునే తీర్చిదిద్దవచ్చును. అయితే ధనముపై ఆధారపడియున్న మైత్రి అప్పడిగితే, విరిగిపోవును. అప్పిచ్చిన, దానితోనే అంతమగును. పదార్థములను యిచ్చి, మైత్రిని బలపరచేది సాధ్యముకాదు, పలుకులతో మైత్రి యేర్పడదు. మైత్రి కుదరవలెనన్న, దృఢముగా నిలువవలెనన్న, హృదయమునకు హృదయము చేరవలెను. కష్టములురానీ, నష్టములు సంభవించనీ, సుఖము చేకూరనీ, దుఃఖమే ఆవరించనీ మైత్రిమాత్రము సర్వకాలమందు సర్వత్ర సర్వావస్థలయందు కూడనూ ఒకేరీతిగా రెండు హృదయములనూ బంధించి బాగుచేయవలెను. ఒకరినొకరు తెలుసుకొని, మంచిగా సానుభూతితో, విచక్షణతో తీర్చిదిద్దుకోవలెను. అన్యాయ మార్గముననుసరించిన ఖండించి, చెడ్డగుణములను, అభ్యాసములను మరుగుపరచనీయక విమర్శించి, మంచి మార్గమునకు త్రిప్పి, సత్కీర్తిని అభివృద్ధి చేయువాడే మిత్రుడు. కాని, టెరిలిన్‌షర్టు వేసుకొని, హలో హలో అనే కేకలు వీటిపై ఆధారపడి, ఆడంబరము వినోదవిహారములనే అభివృద్ధి చేసేవాడు నిజముగా మిత్రద్రోహి. ఉత్తమ స్థానమును, ధనకనకవస్తువాహనాదులను చూడక, హృదయమందున్న ఆత్మతత్త్వమునే గుర్తించి, మిత్రునిగా వరించితే, అది శ్రేష్ఠమైనమైత్రియగును. కుచేలుని స్నేహముయొక్క స్వరూపమేమని మీకు తెలిసియేవుండును.

**భక్తిముద్ర**

భగవంతుని ఏరీతిగా ధ్యానించవలెనో, పూజించవలెనో, భజించవలెనో కుచేలుని కథ సువిదితము చేస్తుంది. భగవంతునికేది సమర్పించవలెనో కుచేలునకు తెలుసును. నివేదనలో ఉన్న భావమునే భగవంతుడు ఎక్కువగా ఆదరించుతాడు. నివేదనయొక్క పరిమాణానికిగానీ, మూల్యమునకుగానీ యేమీ చలించడు. వంట పాత్రకు అంటుకొనిన ఒక ఆకుముక్కను ద్రౌపది సమర్పింపగా, భగవంతుడు తృప్తిచెందినాడు. ఆకలి తీరినదని చెప్పినాడు. రుక్మిణి ఒక్క తులసీదళము మాత్రమే త్రాసులోని సిబ్బెలో వేసినది. కాని, ఆమె తన అనంత భక్తినంతా అందులో చేర్చినందున, ఆ దళము కృష్ణుని బరువుకు సరిపోయినది. కుచేలుడు కొన్ని అటుకులను మాత్రమే తీసుకొని వెళ్ళినాడు. భగవంతుడు తృప్తిగా వాటిని భుజించాడు. ఆ భక్తిపూర్వక నివేదనకు ఎంతగనో సంతోషించాడు. ఏమీ వ్రాయని తెల్లకాగితమునకు యేమీ విలువ లేదు. కాని, ఆ చిన్న కాగితము మలినమైనా రిజర్వుబ్యాంకు ముద్ర ఉంటే ఎంతో విలువ పొందుతుంది. భక్తిముద్ర పడినందున అటుకులు అమూల్యమైనవి.

ఈ కుచేలోపాఖ్యానములో కుచేలుని పాత్రకన్న అతని భార్య పాత్ర చాలా ముఖ్యమైనది. ఆమెకే కృష్ణుని యందు మిక్కుటమైన భక్తి కలదు. వాస్తవములో పురుషులకన్న స్త్రీలకే భక్తి ఎక్కువ. వారు తమ మనసులను ఎక్కువగా నియమించుకోగలరు. తన బిడ్డల ఆకలి తీర్చుకొనుటకై ఆమెలోనున్న మాతృప్రేమ కుచేలుని శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళునట్లు ప్రేరేపించినది. ఆమెకు కృష్ణునిలో సంపూర్ణ విశ్వాసమున్నది. కుచేలుడే తటపటాయించినాడు. కృష్ణుడు తనను గుర్తించడేమో, కృష్ణునకు జ్ఞప్తియందు లేదేమో, ఆహ్వానించడేమో, తన సేవ అందుకొనడేమోనని వితర్కించినాడు. భాగవతములో అతడు నిరంతరము ధ్యాననిమగ్నుడై ఉండునని చెప్పబడినది. మరైతే, ఈ అనుమానమును యేవిధముగా విశదపరచవలెను? ఈ అనుమానమును వదలిపెట్టి, కనీసము కృష్ణుని భవన ప్రాంగణము వద్దకైనా వెళ్ళవలసినదని అతని భార్య ప్రోత్సహించినది. ఆ మాత్రము శ్రమ పడితే కృష్ణుడు అతనిని తప్పక ఆహ్వానించుతాడని ఆమె నమ్మకము. మందిర ద్వారమునకు వెళ్ళునట్లుగా కుచేలుని భార్య బ్రతిమిలాడినది.

**అటుకులు**

కుచేలుని ప్రయాణము నిశ్చయమైన తరువాత వర్షాకాలము కొరకు దాచుకొనిన ధాన్యములోనుంచి ఆమె దోశెడు తీసి, ఉడికించి, ఆరబెట్టి, రోకలితో దంచి అటుకులు తయారు చేసినది. ఇవి కృష్ణునకు బాల్యములో యిష్టమైన చిరుతిండియని కుచేలుడు చెప్పినాడు. వాటిని అంగవస్త్రము చివర మూటకట్టుకొని కుచేలుడు ద్వారకకు బయలుదేరినాడు. అడుగడుగునకు అతని భయము అధికమైపోతున్నది, నిజమైన భక్తునకు భయమనునది ఉండరాదు. తన హక్కుగా భగవంతుని సమీపించి, అనుగ్రహించవలసినదిగా కోరవచ్చును. చక్రవర్తి స్థానమందున్న కృష్ణపరమాత్మునికి, అన్నము లేక అవస్థలుపడే కుచేలునికి మైత్రి యెట్లు కుదురును? భార్యయేమో, మీరు తప్పక వెళ్ళండి అని పంపినది. అయితే ద్వారము దగ్గరకి వచ్చేసరికి, వార్త చెప్పటానికి వెనుకంజ వేసినాడు. చెప్పక తప్పదు, చెప్పితే యేమనుకుంటారో! చివరికి, 'నీ బాల్య మిత్రుడైన కుచేలుడు వచ్చాడు' అని కబురు పంపేసరికి, కృష్ణుడే 'పిలచికొని రండి' అని సేవకుల కాజ్ఞ యిచ్చిరి. లోపలకు పిలిపించుకొని అమితానందముతో పాఠశాల దినములు విషయములు జ్ఞాపకము చేసినాడు. అంగవస్త్రముతో కట్టి తెచ్చిన అటుకులను కృష్ణునకు యెట్లు సమర్పించవలెనో తెలియక మనస్సులో తర్జనభర్జనలు పడుచుండగా, కృష్ణుడది గ్రహించి తానే మూట విప్పుకొని యెంతో ఆనందముతో వాటిని తినసాగాడు. కుచేలుని భక్తి అటుకులను ఎంతో రుచికరము గావించినది. కృష్ణుడు మూడవ గుప్పెడు తీసుకొనుచుండగా రుక్మిణి అతని చేయి పట్టుకొని ఆపినదని చెప్పబడినది. దానికి వ్యాఖ్యాతలు చెప్పిన కారణము, కృష్ణుడు మరికొన్ని అటుకులు తినినట్లైన అతని సర్వసంపదలూ కుచేలునికి చెందుననే భయమట. ఎంత తెలివితక్కువ ఆలోచన! సర్వేశ్వరుని ఐశ్వర్యము శాశ్వతము కాదని, భక్తులందరు ఐశ్వర్యమును పంచుకొనిపోతే ఆయనకేమీ మిగలదని, జగద్ధాత్రి బహుమతులు పంచిపెట్టుటలో లోభత్వము చూపినదని కాబోలు! ఆ భావము సత్యము కాజాలదు. రుక్మిణి భక్తి భరిత హృదయముతో కుచేలుడు సమర్పించిన అటుకులలో తన భాగము కోరినది. ఒక భాగము తనకు రావలెనని, అది తన హక్కు అని చెప్పినది. రుక్మిణి కృష్ణుని చేయి పట్టుకొనుటకు కారణము యిది.

కృష్ణుడు తనకేమీ బహూకరించనందుకు, కనీసము వాగ్దానమైనా చేయనందుకు కుచేలుడు విచారముతో ద్వారకను విడిచిపెట్టాడు. అతని గృహపరిస్థితులు, ఆకలితో అలమటించే బిడ్డలు గుర్తుకు రాగానే వాని మనస్సు క్రుంగిపోయింది. ఆ దుఃఖములో తనను తాను మరచిపోయి తన యిల్లుకూడా దాటిపోతుండగా అతని భార్య చూచి వెనుకకు పిలచినది. ఒక్క రాత్రి అతని యింటిలో గొప్ప పరివర్తనము జరిగి అది ఒక గొప్ప భవనముగా మారిపోయినదని అతడు గ్రహించలేకపోయాడు. కృష్ణుని అనుగ్రహముతో ఆ యింట యెంత ఆనందము వెల్లివిరిసిందో ఆమె వివరించినది.

**కలిమి, లేములు కలలే**

కుచేలుని నిజమైన సాధన ఆనాటినుండి ప్రారంభమైనది. అప్పటి వరకు అతడు ఆచారములను మాత్రమే పాటించినాడు. శాస్త్రముల సూచనలు బాహ్యాచరణకు మాత్రమే పరిమితము చేసినాడు. పరమాత్మ తన మహిమచే యేవిధముగా లేమిని కలిమిగా మార్చినాడో తెలిసికొని, శాశ్వతానంద ప్రాప్తికొరకు భగవదనుగ్రహము పొందవలెనని నిర్ణయించుకొనినాడు. అతడు తనకేది వాంఛనీయమో పూర్తిగా తెలిసికొనినాడు. ఐశ్వర్యముమధ్య నిరాసక్తుడై సన్యాసిగా జీవించ ప్రారంభించాడు. నాటి కలిమి, వెనుకటి లేమి అంతా ఒక కలయని అర్థమైనది. భగవంతుని ప్రేమయే తనకు విలువైన సిరిసంపదలని సంతృప్తి పొందాడు. కృష్ణుని దీనపరత, దివ్య ప్రేమ వీటినే స్మరించి, శ్లాఘించి కుచేలుడు పరవశుడైనాడు.